# అభిప్రాయభేధం

ఆయనకు కూతురుతప్ప ఇంకెవరూ సంతానములేదు. ఆయన వడ్డీవ్యాపారంచేసే షాహుకారువద్ద గుమాస్తా. ఆయన ద్వారానే షాహుకారు బదుళ్ళు ఇచ్చేవాడు. ఆయనే పద్దులు వ్రాసేవాడు, అప్పులు వసూళ్లు చేసేవాడు, ఆయనకు ముప్పయి రూపాయల జీతం. ఇదిగాక నూటికి రూపాయచొప్పున తాను బదులిప్పించిన వారిదగ్గరనుంచి రుసుము వసూలు చేసేవాడు. దానాదీనా ఆయన జీవయాత్ర గడుపుతున్నాడు. ఇల్లు కొన్నాడు, తోట వేయించాడు.

ఈమధ్యనే ఆయన భార్యకొక కాసులపేరూ, కూతిరికొక కంటె చేయించాడు. కూతురు కంటె పెట్టుకొని ఆడుకొంటూంటే తల్లిదండ్రులు చూచి సంతోషించేవారు. కూతురికి అయిదోయేడు.

ఆ ప్రాంతాన యానాదిమనిషి కాపురముంది. ఆమెకు ఒక కూతురు. ఆ కూతురికి మూడోయేడు. రెండు సంవత్సరములైనది భర్త ఆమెను వదలిపెట్టి ఎక్కడికోవెళ్ళి. అప్పటినుంచి ఆ యానాదిమనిషి దొరికినప్పుడు కూలీనాలీ చేసుకొంటూ ఏ చెట్టుకిందో ఏ పంచనో నిద్ర పోతూ కూతురుని పెట్టుకుని కాలక్షేపంచేస్తూ ఉన్నది. రెండుమూడు రోజులపాటు తిండి దొరకనప్పుడూ కూతురుని పోషించడానికి మార్గం కనపడక ఆమె వీధులవెంట ముష్టికి బయలుదేరేది.

ఆ యానాదిమనిషికి ఆ కూతురే సర్వమూ. ఇరుగుపొరుగువాళ్లను యాచించి తెచ్చుకొన్న చిరుగుచొక్కాలతోనూ, పరికిణీలతోనూ కూతురుకి ముస్తాబు చేసేది. ముస్తాబుచేసిన కూతురిని చూచి ఆ తల్లి హృదయం ఉప్పొంగేది.

నల్లని, నున్నని, బూడిద అంటిన శరీరం; చిక్కుకట్టిన నల్లని జుట్టూ; తళతళలాడే నవ్వేకళ్ళూ; అకారణముగా పెదవులు విడిపడడం చేత కలిగిననవ్వూ రోజురోజూ చూచే ఆమెకు ఏ రలేని లోపం కనిపించ లేదు. దీనికితోడు కొంత ముస్తాబు కూతురికి చేస్తేనేకాని ఆ తల్లికి మన శ్శాంతి లేకపోయేది.

అందుకని బయళ్ళలో వికసించిన తంగేడుపువ్వులు తీసుకువచ్చి ఆమె కూతురికి చెవులో జూకా లుంచేది, మెళ్లో పేరులు వేసేది.

ఒకమారు పచ్చగన్నేరు పువ్వులూ, ఒకమారు తురాయి పువ్వులూ, ఒకమారు తంగేడు పువ్వులూ సంపాదించి కూతురికి ముసాబు చేసేది. కాని ఆమెకు ఇంకా తృప్తి కలగలేదు. కారణం ఏమిటంటే?

పండుగలకూ పబ్బాలకూ నాగరీకుల పిల్లలు బంగారు నగలు ధరించడం ఆమె చూచింది. అవి చాలా బాగున్నవని ఆమె అనుకుంది. తన కూతురు కూడా అలాంటి నగలు పెట్టుకుంటే ఎంతబాగుంటుందో— ఎంతబాగుంటుందో! అపూటకు తిండిలేని ఆ యానాదిమనిషికి బంగారు నగలు ఎక్కడనుండి వస్తవి?

సంవత్సరాదినాడు అందరూ ముస్తాబైనారు. అందరూ వేపపువ్వు తిన్నారు.

ఆ యానాదిమనిషికి సంవత్సరానికి ఇతర దినములకూ తేడా ఏమీలేదు. అన్నిరోజులూ ఒక్కటే. అన్నిరోజులూ తిండికీ బట్టకూ తాపత్రయపడవలసిన రోజులే.

అప్పుడు తంగేడుపువ్వులు పూయడంలేదు. రాధామనోహరం పువ్వులూ, నందివర్ధనం పువ్వులూ కలపు. వాటితోటి ఆమె కూతురికి అలంకరించింది. కాని వెనుకటి కోరిక ఇంకా సఫలం కాలేదు. తన కూతురికి బంగారు నగలుంచి ముస్తాబుచేసి ముద్దుపెట్టుకుంటే — ముద్దు పెట్టుకుంటే—

ఆనాడు మధ్యాహ్నం కూతురిని చంకను పెట్టుకొని వీధివెంట నడచి వెళుతున్నది యానాదిమనిషి. కూతురు తల్లితో ఏవేవో ఊసులాడు తున్నది.

ఒకచోట ఆయన—అంటే షాహుకారుదగ్గిర గుమాస్తా — కూతురు ఆడుకుంటున్నది. కంటె మెళ్ళో పెట్టుకొని ఆడుకొంటున్నది. ఆ యానాదిమనిషి ఆ పిల్లను చూచింది. ఆ కంటె చూచింది. తన కూతురికి ఆ కంటె — అలాంటి కంటె పెట్టితే — పెట్టితే ఎంత బాగుంటుందో — అలాంటి కంటె ఎలాగ పెట్టడం? పోనీ ఆ కంటే పెట్టితే — అమ్మో! ఆ కంటే!

ఆ తల్లిప్రాణం ఉండబట్టిందికాదు. ఆ యానాదిమనిషి ఆ పిల్ల దగ్గిరికి వెళ్ళింది. పళ్ళుపెడతానని మంచిమాటలాడింది. మెళ్లో కంటె తీసింది. తన కూతురుమెళ్లో పెట్టింది. చూచింది. తల్లిప్రాణం కుదుట పడింది. తన కూతురిని ముద్దుపెట్టుకొంది. కాని ఒక సందేహం కలిగింది. తంగేడు పువ్వులవల్ల కలిగే అందంకంటే ఈ కంటెవల్ల ఏమి ఎక్కువ అందం కలిగింది? ఎందుకో ఈ భాగ్యవంతులు ఈలాంటి నగలు పెట్టుకుంటారు?

కంటె మెళ్లోనుంచి తీసిన తర్వాత గుమాస్తా కూతురు కెవ్వన కేకవేసింది. యానాదిమనిషి భయపడింది. ఆ పిల్లకేక విన్నవాళ్ళు పరుగెత్తుకొచ్చారు. యానాదిమనిషి పరుగెత్తింది భయపడి. వాళ్ళు వెంట పడ్డారు. పట్టుకొన్నారు. తన్నినారు చితకామతకా ఆ యానాదిమనిషిని.

కంటె తీసినట్లు ఆమె ఒప్పుకుంది. కాని కారణం చెప్పిందికాదు. ఆమె కూతురు మెళ్ళో కంటె వాళ్ళు తీసుకొన్నారు. కూతురు ఏడ్చింది. యానాదిమనిషి కూతురు ఏడ్పువిని జాలిపడింది.

పొట్టగడవక ఆమె దొంగతనం చేసిందని పోలీసువాళ్ళకు ఆమెను అప్పచెప్పారు.

గుమాస్తా న్యాయముగా సంపాదించిన డబ్బుతో చేయించిన కంటె అన్యాయంగా దొంగిలించినందుకు యానాదిమనిషి కొంతకాలం చెరసాలలో కూతురుతోకూడా ఉండవలసి వచ్చింది. దొంగతనము చేసినందుకని ప్రజలన్నారు, తన కూతురికి ముస్తాబు చేసినందుకని ఆమె అనుకొన్నది.

***